క్లుప్తంగా

కొర్ర, వేరుశనగ విత్తనాల పంపిణీ

బేతంచెర్ల: వాసవీ, వనితా క్లబ్ అధ్యక్ష , కార్యదర్శులు బళ్లాని సూర్య, గుప్త, ఉమాదేవి, మణి ఆధ్వర్యంలో డాస్‌టూ డస్క్ -2023 కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని రైతులకు కొర్ర, వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. విద్య, వైద్య రంగాలతో పాటు వ్యవసాయానికి తోడ్పాటు అందిస్తున్నట్లు వాసవీ క్లబ్ ఇంటర్ నేషనల్ డైరక్టర్ నారాయణం తులసి స్వప్న, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కంద గడ్డల మోహన్ రావు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ ధనుంజయ, కోశాధికారి రమణ, సభ్యులు రాజు, విష్ణు, సురేష్ పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత


సంజమ్మకు నగదు అందజేస్తున్న సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నె గ్రామానికి చెందిన యనమల నల్లారెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్‌బీమా పాలసీదారుడు కావడంతో నామినిగా ఉన్న భార్య సంజమ్మకు తక్షణ సాయంగా సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ. 10వేలు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సుబహాన్, పంచాయతీ కార్యదర్శి అన్వర్, వలంటీర్ కౌసర్ పాల్గొన్నారు.

యాగంటిపల్లెలో...

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటిపల్లె గ్రా మానికి చెందిన కొప్పర చిన్న ఓబులేసు(40)అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలను గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బండి బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా మృతుడి భార్య ప్రశాంతికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, డిజిటల్ అసిస్టెంట్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వెచ్చించాలని ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను బుధవారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున పంపిణీ చేశారు.

హుండీ కానుకల లెక్కింపు

బనగానపల్లెరూరల్: మండలంలో నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు జరిగింది. రూ.41,27,816 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ తెలిపారు. అదేవిధంగా బంగారం 342 గ్రాములు, 10 కేజీల 450 గ్రాముల వెండి అభరణాలు అమ్మవారికి భక్తులు కానుకలుగా సమర్పించారన్నారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, నంద్యాల, కర్నూలు, కోవెలకుంట్లకు చెందిన శ్రీసత్యనారాయణ సేవా సమితి సభ్యులు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బనగానపల్లె: పట్టణంలోని బుడగజంగాల కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సంకుల శ్రీను(51) గుండెపోటుతో మృతి చెందడంతో బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంకుల చిన్నస్వామి, తాటికొండ పెద్దబి, శివకుమార్, బాలు, సుబ్బరాయుడు, అర్జున్, జమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పనులు కల్పించడమే లక్ష్యం

డోన్ : వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏపీఓ మహమ్మద్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ పీఆర్‌పీలు, మేటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో ఏయే పనులు అవసరమో వెంటనే గుర్తించి చేయించాలని సూచించారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా చెట్లు నా టే కార్యక్రమానికి ప్రతిపాదనలు పంపాలన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డిపో పరిధిలోని గ్రామాల ప్రజలు బస్ సర్వీసులకు సంబంధించి ఫిర్యాదులు, సూచనలు సలహాలను 9959225798 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని సూచించారు.

నేడు పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి వెటర్నీ ఆసుపత్రిలో జూలై 6వ తేదీన ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా గురువారం పెంపుడు కుక్కలకు పిచ్చి కుక్క వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు వేయడం జరుగుతుందని వెటర్నరీ ఏడీ వసంతలక్ష్మి తెలిపారు. యాజమాన్యాలు తమ పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని సూచించారు.

వలంటీర్లు...సంక్షేమ సారథులు!

- కుటుంబ సభ్యుడిగా మెలుగుతున్న స్వచ్ఛంద సేవకులు
- ప్రభుత్వ పథకాలు అందజేస్తూ... అన్నింటా ముందుంటూ సాయమందిస్తున్న తీరు
- ప్రజల వద్దకే పాలనలో వీరిదే కీలక పాత్ర
- వెల్లువెత్తుతున్న మన్ననలు


ఆసుపత్రిలో లబ్ధిదారురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)


వలంటీర్లను అవార్డులతో సత్కరిస్తున్న దృశ్యం (ఫైల్)

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రజల వద్దకే పాలన ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడంతో ఈ వ్యవస్థల పాత్ర కీలకంగా మారింది. ప్రత్యేకించి ప్రతి యాభై కుటుంబాలకు ఒకరు చొప్పున నియమించిన వలంటీర్‌లు పేదల అభ్యున్నతికి సంక్షేమ సారథులుగా నిలుస్తున్నారు. ఓ కుటుంబ సభ్యుడిగా ముందుంటూ అన్నివిధాలుగా అండగా నిలుస్తున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయడంలో వలంటీర్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. దీంతో వలంటీర్లు స్వచ్ఛందంగా అందజేస్తున్న సేవలపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వలంటీర్‌ల సేవలను ప్రభుత్వం గుర్తించి ప్రతి ఏటా సేవా వజ్ర కింద రూ.30వేలు, సేవారత్న- రూ.20 వేలు, సేవామిత్ర- రూ.10వేలను అందజేస్తూ ప్రోత్సహిస్తుంది కూడా.

దళారీ వ్యవస్థను రూపుమాపిన వలంటీర్ వ్యవస్థ

వలంటీర్ వ్యవస్థ దళారీ వ్యవస్థను రూపుమాపిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నందున ఎవరూ ప్రశ్నించే పరిస్థితి లేదు. ప్రతిఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేయాలన్నదే లక్ష్యంగా వలంటీర్‌లు వ్యవరిస్తున్న తీరు వ్యతిరేకతకు ఏ మాత్రం తావులేని పరిస్థితి. గత ప్రభుత్వం ఏ పథకం వర్తించాలన్నా జన్మభూమి కమిటీ సభ్యుల సిఫారుసు తీరును చవిచూసిన ప్రజలు వలంటీర్‌ల సేవలను అభినందిస్తున్నారు.

దీవిస్తున్న అవ్వాతాతలు...

ప్రత్యేకించి పింఛన్ పంపిణీలో వలంటీర్‌ల సేవలు ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఒకటిన ఠంచన్ పింఛన్ అందజేస్తున్న తీరును ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు సైతం చాలా వరకు మెచ్చుకుంటున్నారన్నది వాస్తవం. గతంలో పింఛన్ సొమ్ము కోసం నిరీక్షించిన వృద్ధులు, దివ్యాంగులు తెల్లారకముందే ఇంటి తలుపు తట్టి నగదు అందజేస్తున్న వలంటీర్లను మనస్ఫూర్తిగా ఆశీర్వాదిస్తున్నారు. గతంలో పింఛన్ కోసం వెళ్లి స్పృహతప్పిన సంఘటనలు గుర్తు చేసుకుంటూ వలంటీర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు సామాజిక పింఛన్ లబ్ధిదారులు.

మరువలేని 'కరోనా సమయం' సేవలు

ప్రత్యేకించి కరోనా మహమ్మారి విజృంభించిన కఠిన సమయంలో వలంటీర్‌లు సేవలు ఎప్పటికీ మరువలేనివనే చెప్పాల్సి ఉంటుంది. కరోనా బాధితులంటే భయభ్రాంతులకు గురయ్యే సమయంలో వలంటీర్లు అందజేసిన సాయం అంతాఇంతా కాదు. కరోనా సోకిన వ్యక్తులతో మాట్లాడుతూ మనోధైర్యాన్ని నింపడమే కాకుండా వైద్యసేవలు అందజేస్తూ అండగా నిలిచారు.

ఇళ్ల వద్దనే ధ్రువీకరణ పత్రాలు

సాంకేతిక, ఇతర సమస్యల మూలంగా సంక్షేమ పథకాలు అందని పేదలను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలోనూ వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు వెళ్లి ప్రజల వివరాలు సేకరించడంతోపాలు ఆయా కుటుంబాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను గుర్తించి నమోదు చేసుకుంటున్నారు. వివరాలను అధికారులకు వివరించి గంటల్లో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు వలంటీర్లు.

డోన్ నియోజకవర్గంలో వలంటీర్ల వివరాలు

సచివాలయాల సంఖ్య	వలంటీర్ల సంఖ్య
డోన్ టౌన్ : 16	285
డోన్ రూరల్ : 20	336
బేతంచెర్ల : 21	462
ప్యాపిలి : 23	363

అంతులేని ఆత్మతృప్తి



ఏదో ఒక రూపంలో పేద ప్రజలకు సేవ చేయాలనే దృఢసంకల్పంతో వలంటీర్‌గా పనిచేస్తున్నా. ప్రతిఒక్క పథకాన్ని ప్రజలకు తెలియజేస్తున్నా. నిరక్షరాస్యులకు చేయూతగా ఉండడం ఎంతో సంతోషాన్నిస్తుంది. పేదలకు ప్రభుత్వం నుంచి కలిగే ప్రయోజనాలను చూసి ఆత్మ సంతృప్తి కలుగుతోంది.

– బాలక్రిష్ణ, 16వ సచివాలయ వలంటీర్, డోన్.

సంతోషంగా ఉంది



సామాజిక సేవ చేయాలనే తలంపుతో వలంటీర్‌గా పనిచేస్తున్నా. మా ద్వారా ప్రభుత్వ ప్రయోజనాలు పొందిన లబ్ధిదారులు పడే ఆనందాన్ని చూసి ఎంతో సంతృప్తి కలుగుతోంది. అంకితభావంతో అర్హులకు తమవంతుగా న్యాయం చేస్తున్నా. సేవాభావంతో వలంటీర్‌గా పనిచేస్తున్నందుకు చాలా సంతోషపడుతున్నా.

– మనోహర్‌నాయుడు, ప్యాపిలి పట్టణ వలంటీర్

వలంటీర్ల సేవలు బాగున్నాయి



వలంటీర్ల సేవలు చాలా బాగున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు గుర్తించడంలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు. అర్హులైన పేదల వివరాలను గుర్తించి అధికారులకు విన్నవిస్తున్న తీరు బాగుంది. గౌరవ వేతంతో వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయం. పేదలకు న్యాయం జరుగుతుంది.

– శ్రీనివాసులు, ఎంపీడీఓ, డోన్.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ప్యాపిలి: ఉపాధ్యాయులు విధులను అంకితభావంతో నిర్వర్తించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ వెంకటేశ్ నాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని జలదుర్గం, రామకృష్ణాపురం, ఎస్ రంగాపురం, మాధవరం, గార్లదిన్నె తదితర గ్రామాల్లోని పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయుల అలసత్వంపై ఫిర్యాదులు అందుతున్నాయని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని సూచించారు. నాడు-నేడు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

నేడు నొస్సంలో జగనన్న సురక్ష సదస్సు

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో గురువారం జగనన్న సురక్ష సదస్సు ఉంటుందని ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. అర్హత ఉండి ఇంకా ప్రభుత్వ పథకాలు అందని పేదలు సదస్సులో సంప్రదిస్తే పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. అదేవిధంగా ఆదాయ, కుల ధ్రువీకణ తదితర పత్రాలతోపాటు 11రకాల ప్రభుత్వ సేవలను అందిచనున్నామని, ప్రజలు సద్వినియెగం చేసుకోలని ఎంపీడీఓ సూచించారు.

బేతంచెర్ల: పట్టణంలోని 1,2 సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి బుధవారం తెలిపారు. 1వ సచివాలయంలో కమిషనర్ రమేష్ బాబు, 2వ సచివాలయంలో తహసీల్దార్ నరేంద్రనాథ్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ మౌలానీ సూచించారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ సర్కిల్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు తదితర ప్రాంతాలవైపు వెళ్తున్న వాహనాల రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని, రోడ్డు నిబంధనలు పాటించని వాహన చోదకులకు జరిమానా విధించారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక


ఉపాధి పనుల వివరాలపై ఆరా తీస్తున్న అధికారులు

అవుకు: మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై బుధవారం స్థానిక ఎంపీడీ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, వాటర్ షెడ్ పీడీ సలీమ్ భాషా, జిల్లా విజిలెన్స్ అధికారి సిద్ద లింగమూర్తి, డోన్ క్లస్టర్ ఏపీడీ శ్రీవిద్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అవుకు మండలంలో 2022-2023 సంవత్సరానికి సంబంధించి రూ.7 కోట్లతో వివిధ శాఖలకు చెందిన 390 పనులు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించారు. తప్పులు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు రూ.8,500 పెనాల్టీ విధించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఏపీఓ అనీఫా తదితరులు పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లెరూరల్: డెంగీ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. బుధవారం టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య పరిధిలోని కైప గ్రామంలో ఆయన పర్యటించారు. డెంగీ నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమంతో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల ముందు నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అవుకు: మండల పరిధిలోని మంగంపేట గ్రామంలో బుధవారం డెంగ్యూ నివారణపై ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్, ఏఎన్ఎం హేమలత, సీహెచ్‌ఓ మాధురి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలి


సర్వేను పరిశీలిస్తున్న వెంకటరమణ

కోవెలకుంట్ల: కుష్టు(హాంసన్)వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. మండలంలోని రేవనూరు పీహెచ్‌సీ పరిధిలోని కలుగొట్ల గ్రామంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు నిర్వహిస్తున్న కుష్టువ్యాధి సర్వేను బుధవారం డీఎంహెచ్‌ఓ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ జగదీష్‌చంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో సర్వే కొనసాగుతోందన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటి సర్వే నిర్వహించి స్పర్శలేని మచ్చలు ఉన్న వ్యక్తులు గుర్తించి వివరాలు నమోదు చేస్తారన్నారు. అలాంటి వ్యక్తులకు కుష్టు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే రెండు రకాల చికిత్సల ద్వారా వైద్యం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభాని, హెల్త్‌సూపర్‌వైజర్లు వీరభద్రుడు, గిరిజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా పాటించాలి

డోన్ : విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పాఠశాలలు, వసతి గృహాల్లో మెనూ అమలు చేయాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి హెచ్‌ఎంలు, హాస్టల్ వార్డెన్లకు సూచించారు. అయ్యప్ప స్వామి గుడి వద్ద పాత అభ్యుదయ కళాశాలలో ఏర్పాటైన మహాత్మా జ్యోతిరావుపూలే(బీసీ బాలికల) రెసిడెన్షియల్ స్కూల్‌ను మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడుతో కలిసి బుధవారం ఎంపీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వసుంధర దేవితో మాట్లాడి విద్యార్థుల సంఖ్య, మెనూ అమలు తీరును తెలుసుకున్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, ఎంపీపీ చల్లా , జెడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మీ

అవుకు: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని మెట్టుపల్లె, కోనాపురం గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే కాటసాని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డితో కలిసి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండల కేంద్రం అవుకు నుంచి భారీ బైక్ ర్యాలీతో మెట్టుపల్లె గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. మెట్టుపల్లె రజకులు ధోబీ ఘాట్ కావాలని, మారెమ్మ ఆలయం నుంచి సత్రం, కొత్త సచివాలయం వరకు సీసీ రోడ్ల, బల్లకుంట, కమ్మల్ల కుంట, వెంగమాంబ చెరువు రహదారుల్లో గ్రావెల్ రోడ్లను వేయించాలని, అదేవిధంగా కోనాపురంలో దర్గా నుంచి ఎస్సీ కాలనీకి సీసీ రోడ్డు, శ్మశాన వాటికను నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని, వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, ఈఓపీఆర్డీ రామక్రిష్ణవేణి, డాక్టర్ భారతీదేవి, ఏఓ అబ్దుల్ హక్, సర్పంచ్ కొత్తపేట మద్దిలేటి, ఉపసర్పంచ్ మేకల వెంకటేశ్వర రెడ్డి, నాయకులు ఈరిగ వీరారెడ్డి, గొంగటి నాగభూషణం రెడ్డి, యాగన్నగారి గంగాధర్ రెడ్డి, శీగే కృష్ణా రెడ్డి, లాయర్ శీగే రాజగోపాల్ రెడ్డి(అడ్వకేట్), కునిగారి రమణ, చల్లా విక్రాంత్ రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి, చల్లా చైతన్య రెడ్డి, కొప్పూరి మద్దయ్య, మూరం నర్సిరెడ్డి, తోట నరేష్, వంగల సాంబశివారెడ్డి, నారాయణ రెడ్డి, వీరారెడ్డి, కృష్ణారెడ్డి, గోపాజి నారాయణ, నక్క బక్కయ్య, గోపాజి సత్యం, జీనుగు వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.14 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

మెట్టుపల్లె గ్రామంలో రూ.2.14 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.30లక్షలతో గ్రామంలో ఓహెచ్ఆర్ ట్యాంక్, రూ.70లక్షలతో అవుకు నుంచి మెట్టుపల్లెకు 3.5 కిలోమీటర్లు నిర్మించిన బీటీ రోడ్డును, రూ.53లక్షలతో గ్రామంలో 350 మీటర్లతో నిర్మించిన సీసీ రోడ్డులను ఎమ్మెల్యే ప్రారంభించారు.


వృద్ధురాలి బాగోగులను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

జగన్ బాబు పింఛన్‌తోనే... జీవనం సాగిస్తున్నా!

మెట్టుపల్లెలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని ఎస్సీ కాలనీలో నడవలేని స్థితిలో ఉన్న ఓ పండు వృద్ధురాలిని పరామర్శించారు. ఏమవ్వా... బాగున్నావా...అని పలుకరించాడు. పింఛన్... అని ఎమ్మెల్యే అనేలోపే వస్తుంది నాయనా... జగన్ బాబు పుణ్యమా అని అందుతుందయ్యా అని వృద్ధురాలు తెలిపింది. నడవలేని తనకు వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి అందజేస్తున్నాడంది. పింఛనే రాకుంటే నా జీవనం మరీ దుర్భరంగా ఉండేదంటూ కన్నీరు పెట్టుకుంది వృద్ధురాలు. మీలాంటివారి కోసమే సీఎం... వలంటీర్‌లను నియమించారని... వైద్య సేవలు కూడా మీ దగ్గరికి వచ్చి అందజేస్తారని... అధైర్యపడొద్దని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వృద్ధురాలికి భరోసా కల్పించారు.

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్య

కోవెలకుంట్ల: మండలంలోని వల్లంపాడు గ్రామానికి చెందిన చిన్న శ్రీనివాసులు(50) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రేవనూరు ఎస్ఐ కల్పన అందించిన సమాచారం మేరకు శ్రీనివాసులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఉదయం కోవెలకుంట్లకు వచ్చిన ఆయన క్రిమి సంహారక మందుతాగి చనిపోతున్నట్లు ఫోన్‌ద్వారా బంధువులకు సమాచారం అందించాడు. హుటాహుటిన పట్టణానికి చేరుకున్న బంధువులు అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాసులును చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృత్యువాత పడ్డాడు. మృతునికి భార్య వెంకటలక్ష్మమ్మ, కుమారుడు తిరుపాలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చే సి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆకుమల్లలో మహిళ...

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో బుధవారం ఓ మహిళ బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివారాలు ఇలా ఉన్నాయి. దుబ్బా భాస్కర్ రెడ్డికి పెద్ద కుమార్తె నవిత (32)ను గోస్పాడు మండలం ఎం కృష్ణపురం గ్రామానికి చెందిన దండే కృష్ణారెడ్డి కుమారుడు దండే శేఖర్‌తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. మతిస్థిమితం సరిగలేనందున పదేళ్లుగా భర్త దూరంగా ఉన్నాడు. పుట్టింట్లో ఉన్న ఆమె మధ్యాహ్నం తండ్రి భాస్కర్ రెడ్డి పొలం పనులు పూర్తిచేసుకుని వచ్చేసరికి లేదు. ఇంతలో కొందరు భావిలో పడిందని చెప్పారు. అక్కడికి వెళ్లి చూడగా బావిలో శవమై తెలింది. మతిస్థిమితం సరిగాలేక భావిలో పడి ఉంటుందన్న తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేపడుతామని ఎస్ఐ తెతిపారు.

కారు బోల్తా

బేతంచెర్ల: హెచ్ కొట్టాల గ్రామ సమీపాన మంగళవారం అర్ధరాత్రి డోన్ నుంచి నంద్యాల వైపు వెళ్తున్న కారు రోడ్డు ప్రక్కన చెట్టును ఢీకొని బోల్తాపడింది. కారులోని ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. కోవెలకుంట్లకు చెందిన మునీర్, షరీఫ్ అనే వ్యక్తులు సొంత పనుల నిమిత్తం బైక్‌పై ఆళ్లగడ్డకువెవెళ్లారు. తిరిగి వస్తుండగా మండలంలోని కంపమల్ల మెట్ట సమీపంలో ఎదురుగావస్తున్న బర్రెను ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. దొర్నిపాడు 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మునీర్‌కు కాలు విరగడంతో ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్అండ్‌బీ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన రాంమోహన్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకటరెడ్డి సమాచారం మేరకు రాంమోహన్‌రెడ్డి స్కూటీపై వెళ్తుండగా నంద్యాలవైపు నుంచి కారులో వస్తున్న మస్తాన్‌వలి పట్టణ శివారులోని కుందూనది వై జంక్షన్‌లో ఢీకొట్టాడు. గాయపడిన రాంమోహన్‌రెడ్డికి స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గంజాయి విక్రేతలకు రిమాండ్

డోన్ టౌన్ : పట్టణంలోని చిగురమానుపేటకు చెందిన గంజాయి విక్రేతలు విజయకుమార్, బోయ శేఖర్‌ను జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు పట్టణ సీఐ శేషయ్య బుధవారం తెలిపారు. వీరు గుత్తి రోడ్డులో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. 2కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

దాడి కేసు నమోదు

బేతంచెర్ల: భార్య, భర్త తనపై దాడి చేసి గాయపరిచారని మండల పరిధిలోని గూటుపల్లెకు చెందిన యామక్కగారి రవిశేఖరమ్మ పోలీసులను ఆశ్రయించింది. హెడ్ కానిస్టేబుల్ రమణ వివరాల మేరకు రవిశేఖరమ్మ పిల్లలు పక్క ఇంట్లో ఆపరిశుభ్రం చేశారని, బావ రంగ నాయకులు, భార్య మద్దమ్మ గొడవ పెట్టుకొని తిట్టడమే కాకుండా కొట్టి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మద్యం, నాటుసారా, గుట్కా ధ్వంసం

బేతంచెర్ల: డోన్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి ఉత్తర్వుల మేరకు మండలంలో పట్టుడిని కర్ణాటక మద్యం, నాటుసారా, గుట్కాలను బేతంచెర్ల సీఐ ప్రియతం రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేశారు. ధ్వంసం చేసి వీటి విలువ సుమారు రూ. 4లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు.

ఇరు వర్గాలు ఘర్షణ– కేసు నమోదు

డోన్ టౌన్ : ఉపాధి హామీ పనుల గురించి ఇరు వర్గాలు ఘర్షణ పడటంతో ఒక వర్గానికి చెందిన 8మంది, మరో వర్గానికి చెందిన 6మందిపై కౌంటర్ కేసు నమోదు చేసినట్లు సీఐ శేషయ్య బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గోసానిపల్లెలో కొన్నేళ్ల క్రితం ఉపాధి పనులు ప్రజల మధ్య సయోధ్య లేక నిలిచిపోగా ఈ సంవత్సరం అధికారులు తిరిగి ప్రారంభించినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే ఒక వర్గం వారికి మాత్రమే పనులు చేసుకుంటున్నారని మరో వర్గం మంగళవారం రాత్రి ఇళ్లపై దాడులకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. దీంతో రెండో వర్గం తిరగబడి పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఈ మేరకు బుధవారం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జరిగిన సంఘటన విచారించి ఇరు వర్గాలపై కౌంటర్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.